క్లుప్తంగా

ఎన్నికల విధులపై శిక్షణ



ఎన్నికల విధులను వివరిస్తున్న ఆర్వో చిన ఓబులేసు

వెంకటాచలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులపై వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన అన్ని రకాల విధుల గురించి సర్వేపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన ఓబులేసు సిబ్బందికి అవగాహన కల్పించారు.

రూ.2.10 లక్షల నగదు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

మనుబోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మనుబోలు మండలంలోని బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద హైవేపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.2.10 లక్షల నగదును శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా గూడూరు నుంచి నెల్లూరు జిల్లా కావలి మండలం ఆముదాలదిన్నెకు చెందిన తాతా ప్రవీణ్‌కుమార్ మోటార్‌సైకిల్‌పై వెళుతున్నాడు. అతనిని ఆపి తనిఖీ చేయగా ఎలాంటి బిల్లులు లేకుండా రూ.2.10 లక్షల నగదు ప్రవీణ్‌కుమార్ వద్ద ఉండడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

గిరిజనులకు ఓటు హక్కుపై అవగాహన



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న స్వీప్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడు గ్రామంలో శుక్రవారం గిరిజనులకు ఓటు హక్కుపై స్వీప్ అధికారులు అవగాహన కల్పించారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకోవడం ద్వారా సక్రమమైన ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గిరిజనులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం, మల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రావణసేవ



రావణ వాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

మనుబోలు: స్థానిక సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి మనుబోలులో రావణసేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి రావణ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవానికి బొమ్మిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, అరుణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ముత్తుకూరు: ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ప్రతిపక్షాలు పేదల సేవలకు తమను దూరం చేసినందుకు నిరసనగా ముత్తుకూరు మండలంలోని పిడతాపోలూరు సచివాలయానికి చెందిన వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు 20 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ లక్ష్మణకుమార్‌కు అందజేశారు.

కూటమి పేరుతో మళ్లీ మోసమా..?

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండా మళ్లీ కూటమి పేరుతో ప్రజలను మోసగించేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడతాపోలూరు, ముసునూరువారిపాళెం గ్రామాల్లో శుక్రవారం మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను, డ్వాక్రా సంఘాల మహిళలను మోసగించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఒంటరిగా పోటీ చేయలేక జనసేన, బీజేపీలను కలుపుకుని ఎన్నికలకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. రైతుభరోసా పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందజేశారని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళల రుణాల నగదును నాలుగు విడతల్లో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరుందని, మోసకారి బాబును నమ్మవద్దని, ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు.

సోమిరెడ్డికి ఓటమి తప్పదు

టీడీపీ సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓటమి తప్పదని మంత్రి కాకాణి అన్నారు. ముత్తుకూరు మండలంలో టీడీపీ నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. సోమిరెడ్డి మూడో పర్యాయం తన చేతిలో ఓటమి పాలుకావడం తథ్యమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సోమిరెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు. కరోనా కష్టకాలంలో తాను ప్రతి గ్రామానికి వెళ్లి నిత్యావసర సరకులు అందజేశానని మంత్రి కాకాణి తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చూస్తే వైఎస్సార్‌సీపీ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణి సమక్షంలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు

తోటపల్లిగూడూరు: మండలంలోని పేడూరు పంచాయతీకి చెందిన పలువురు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. రెండు రోజుల క్రితమే వీరందరూ టీడీపీలో చేరి 48 గంటలు కాక ముందే సోమిరెడ్డి చేష్టలు నచ్చక మళ్లీ వైఎస్సార్‌సీపీ గూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో పేడూరు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



నాయుడుపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చలపతిరావు తదితరులు

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలను ఓటర్లు ఆశీర్వదించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. మండలంలోని నాయుడుపాళెంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి చేయగల సత్తా ఉన్న నేత విజయసాయిరెడ్డి అని, నిరంతరం ప్రజల్లో ఉండి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నేత ప్రసన్నకుమార్‌రెడ్డి అని పేర్కొన్నారు. వీరిద్దర్నీ గెలిపించుకుంటే జిల్లా, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో పేదరికం అంతరించిపోవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. భావితరాల భవిష్యత్ కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు మారంరెడ్డి నారసింహారెడ్డి, మాగుంట గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, ధారా ఉమామహేశ్వరరావు, చింతా చలపతి, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేద్దాం

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



కమ్మపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: మండలంలోని కమ్మపాళెంలో ఈ నెల 16న జరిగే వైఎస్సార్‌సీపీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పిలుపునిచ్చారు. కమ్మపాళెంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమై సభ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు గ్రామంలో జరిగే బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గ్రామంలో పెద్ద ఎత్తున ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలు విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులంతా సమైక్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లం వెంకయ్యనాయుడు, గరిక మస్తానయ్య, నల్లావుల శ్రీనివాసులు, బెల్లం వెంకట నగేష్‌నాయుడు, తలతోటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే వారిని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వారిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి ప్రజలను కోరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 11, 12 వార్డుల్లో శుక్రవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డిని గెలిపించాలని ప్రతి గడపకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అలాగే విజయసాయిరెడ్డిని ఎంపీగా గెలిపించుకోవడం ద్వారా జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఆలోచించి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలన్నారు. కాగా స్థానికులు ఈ ప్రచారంలో స్వచ్ఛందంగా పాల్గొని వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, రూరల్ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

విడవలూరు: విడవలూరులోని మండల పరిషత్ మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వల్లకవి శ్రీనివాసులు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా విద్యాసామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు చవటపాళెంలో ఎన్నికల ప్రచారం

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం వెంకటాచలం మండలం చవటపాళెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామానికి చేరుకుని ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

కొడవలూరు: కొడవలూరు, విడవలూరు, కోవూరు పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఎస్పీ వెంట ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు కె.వీరప్రతాప్, వై.రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.

వలంటీర్లనూ కొనేశారు

- టీడీపీ కండువాలు వేసిన వైనం

కోవూరు: ఓటమి భయంతో టీడీపీ రోజుకో విన్యాసం చేస్తోంది. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో తాజాగా శుక్రవారం విడవలూరు మండలంలో స్థానిక టీడీపీ నేత విజయభానురెడ్డి వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ప్యాకేజీ ఇచ్చారు. వారికి టీడీపీ కండువాలు కప్పి ఎన్నికల్లో పనిచేయాలని ఆదేశించారు. వలంటీర్లు తాము పార్టీలో చేరబోమని, ప్రజల్లోకి వెళ్లలేమని చెప్పినా.. వినకుండా చేయాల్సిందేంటూ బెదిరించినట్లు సమాచారం. వలంటీర్లు టీడీపీకి జైకొడుతున్నారంటూ పచ్చమీడియాలో ప్రచారం చేసుకున్నారు. నాయకులను, వలంటీర్లను కొన్నంత మాత్రాన క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయలేరని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

కావలి: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కావలి పట్టణం పాతూరులో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి పదేళ్లు అవుతున్నా కేంద్రం నుంచి అనుకున్న సహకారం లభించకపోవడం, రాష్ట్రంలో నిధుల కొరత వంటి పరిస్థితుల్లోనూ ఐదేళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పాలన అందించి సమర్థవంతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. భవిష్యత్ తరాల బాగుకోసం మళ్లీ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావలి బరిలో ఎమ్మెల్యేగా నిలిచిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు జనిగర్ల మహేంద్రయాదవ్, కాటా శ్రీనివాసులు రెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మండలి కృష్ణారావు, పానుగోటి అనురాధ, షేక్ షాహాల్ హమీద్, తోట హరి, ఆత్మకూరి కలగయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

మోడేగుంటలో ప్రచార హోరు



ఓటరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మండలంలోని మోడేగుంట గ్రామంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను తెలుసుకుని సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలోని ప్రజలకు రూ.1.72 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు



పోలింగ్ బూత్ వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న చిన ఓబులేసు

మనుబోలు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని సర్వేపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ చిన ఓబులేసు తెలిపారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి, బద్దెవోలు, వెంకన్నపాళెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌లు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులను పరిశీలించారు. ఎక్కువ శాతం ఓటింగ్ నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ చిరంజీవి, వీఆర్‌ఏ రమేష్ తదితరులు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

మనుబోలు: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ సుధాకర్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. శిలాఫలకాలకు అడ్డుగా ఇప్పటికే పేపర్లు అంటించినట్లు తెలిపారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సోమిరెడ్డీ.. తప్పుడు ఆరోపణలు మానుకో..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెంకటాచలం: రానున్న ఎన్నికల్లో మళ్లీ ఓటమి పాలవుతాననే భయంతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆయన తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవుపలికారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు రామదాసుకండ్రిగ గ్రామ రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామదాసుకండ్రిగ భూములకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నివిధాలా రైతులకు న్యాయం చేసేలా కృషి చేశారని, ఈ విషయం రైతులందరికీ తెలుసునని తెలిపారు. గత టీడీపీ పాలనలో ఆ భూములను సోమిరెడ్డి తక్కువ రేటుకు లాక్కోవాలని చూస్తే, కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. అయితే ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చాట్ల వెంకటసుబ్బయ్య మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కడివేటి శివ, మందా కృష్ణ, మందా రమణయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీ తీసుకురండి



మాట్లాడుతున్న పెదమల్లు రమణారెడ్డి

పొదలకూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి భారీ మెజారిటీ తీసుకువచ్చేలా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా పనిచేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి కోరారు. పొదలకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పొదలకూరు పంచాయతీ నుంచి ఈ పర్యాయం భారీ మెజారిటీ తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



సిరి



తులసి



కీర్తన



బోలా శ్రావ్య



చరిష్మా

ముత్తుకూరు: ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు శుక్రవారం వెలువడిన సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 98.64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ సుజాత తెలిపారు. ముఖ్యంగా 72 మంది పరీక్షలు రాయగా వీరిలో 72 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో పి.సిరి అనే విద్యార్థిని 1,000 మార్కులకు 961 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. బైపీసీలో తులసి అనే విద్యార్థిని 955 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించింది. జూనియర్ ఇంటర్‌లో 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 73 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో చరిష్మా, యశస్విని 470 మార్కులకు 453 మార్కులు సాధించారు. బైపీసీలో హారిక అనే విద్యార్థిని 440 మార్కులకు గాను 420 మార్కులు సాధించింది.

బాలికల హవా

మనుబోలు: మండలంలో శుక్రవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు హవా చాటారు. కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మార్కులు విజయం సాధించారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 66 మంది విద్యార్థులకు గాను 56 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. ఇక్కడ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కాగితాలపూరు గ్రామానికి చెందిన బోలా శ్రావ్య 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించింది. బైపీసీలో ఆర్.నీలిమ 893 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. సీఈసీలో సుమలత 784 మార్కులతో మూడో స్థానం సాధించింది.

ప్రథమ సంవత్సరం

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 55 మంది విద్యార్థులకు గాను 35 మంది(64 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మనుబోలు హైస్కూల్ ప్లస్‌లో 35 మంది విద్యార్థులకు గాను 19 మంది (54 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో యాచవరం గ్రామానికి చెందిన చల్లా చరిష్మా 470 మార్కులకు గాను 401 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

వెంకటాచలంలో..

వెంకటాచలం: వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 31.70 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 82 మందికి గాను, 26 మంది ఉత్తీర్ణులయ్యారు. వై.కీర్తన 932 మార్కులు సాధించింది. అలాగే ప్రథమ సంవత్సరం విద్యార్థులు 83 మంది గాను కేవలం 8 మంది (9.63 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు: పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో ఎస్.కార్తీక్ 470 మార్కులకు 460 సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఎస్‌కే సమీర్ 459 మార్కులతో ద్వితీయ స్థానం, ఎంవీ పుష్పలత 454 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ ఎ.సుబ్బారావు తెలిపారు. బైపీసీలో ఎస్.జాహ్నవి 440 మార్కులకు 414 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. సీఈసీలో వి.వెంకటఅభిషేక్ 500 మార్కులకు 442 మార్కులతో కాలేజీ ఫస్ట్‌గా నిలిచాడు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో షేక్ షర్మిల 950 మార్కులు, వి.శ్రీజ 935 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం ప్రతిభ విద్యార్థులను అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, జీఎస్‌రెడ్డి, ఇన్‌చార్జిలు కృష్ణ, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్యాకేజీలకు అమ్ముడుపోయి విమర్శలా?

- వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ కంటాబత్తిన



ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: గత ఎన్నికల వరకు టీడీపీలో ఉండి.. ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీకి వచ్చి ఇప్పుడు నిస్సిగ్గుగా ప్యాకేజీలకు అమ్ముడుపోయి తమ పార్టీని విమర్శించడం మీ దగాకోరు రాజకీయానికి నిదర్శమని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రాఘునాథ్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం సంగంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతిపక్ష నాయకులు తమ ఎమ్మెల్యే మేకపాటి వల్ల లబ్ధి పొంది ఎన్నో సొంత పనులు కూడా చేయించుకున్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వెంట ఎందుకు నడవలేకపోయామంటూ మొసలి కన్నీళ్లు కార్చారని, గౌతమ్‌రెడ్డి అనంతరం విక్రమ్‌రెడ్డి సైతం మీకు సముచిత స్థానం కల్పించారన్నారు. పార్టీ మారి నీతులు మాట్లాడే మీరు 2006లో సర్పంచ్ కాక ముందు నీ పరిస్థితి ఏమిటో, ప్రస్తుతం ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. 2024 ఎన్నికల్లో విక్రమ్‌రెడ్డి తప్పక విజయం సాధిస్తారన్నారు. అనంతరం మండలంలోని చెన్నవరప్పాడు, తలుపూరుపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందచేసి వైఎస్సార్సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వరాలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు పావళ్ల కొండయ్య, మల్లికార్జున, తలుపూరుపాడు నాయకులు షేక్ కరిముల్లా తదితరులు ఉన్నారు.